నమస్తే తెలంగాణ
నిజామాబాద్, సోమవారం 1 ఏప్రిల్ 2024
MONDAY, APRIL 1, 2024

# సర్కారు బడి.. సమస్యల ఒడి..

- గోడలకు ఏర్పడ్డ పగుళ్లు
- పనిచేయని బోరు.. కుళాయి నీరే దిక్కు
- నిరుపయోగంగా మరుగుదొడ్లు



పెచ్చులూడిన గోడలు ఉన్న గదిలోనే చదువుకుంటున్న విద్యార్థులు

డోంగ్లీ, మార్చి 31: తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉంటుంది. ఉత్తమ పౌరులు తయారయ్యేది తరగతి గది నుంచే. అలాంటి తరగతి గదుల్లో అన్ని వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణం ఉంటేనే ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు విద్యార్థులకు బాగా అర్థమవుతాయి. కానీ మండలంలోని లింబూర్ ప్రాథమిక పాఠశాలలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉన్నది. పాఠశాలలో మొత్తం 71 మంది చిన్నారులు చదువుకుంటున్నారు. పాఠశాల గోడలు బీటలు వారాయి. భూమి కూడా దిగబడిపోతున్నది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉన్నదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పగుళ్లు ఏర్పడడంతో విష పురుగులు తరగతి గదుల్లోకి వచ్చే ప్రమాదం ఉన్నదని విద్యార్థులు అంటున్నారు. పాఠశాలలో ఉన్న బోరు పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులు కుళాయిల ద్వారా వచ్చే నీటిని తెచ్చుకొని డ్రమ్‌లో నింపుకుంటున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో నీళ్లు లేక ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. పాఠశాలలో ఉన్న మరుగుదొడ్లు కూడా పనిచేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తరగతి గదులకు మరమ్మతులు చేయించాలని, నీటి వసతి కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



కుళాయి వద్ద నీటిని పట్టుకుంటున్న విద్యార్థి



పాఠశాలలో పనిచేయని బోరు





నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు

# బిచ్కుందలో ఆవుల చోరీ



సీసీ టీవీలో నిందితుల రికార్డు





పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న గ్రామపెద్దలు

బిచ్కుంద, మార్చి 31: బిచ్కుందలోని హనుమాన్ ఆలయానికి చెందిన ఆవులు నెల రోజుల నుంచి చోరీకి గురవుతున్నాయి. నెల రోజులుగా ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయి. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక యజమాని తన ఇంటి ఎదుట కట్టేసిన నాలుగు ఆవులకు దొంగలు మత్తు ఇంజెక్షన్ ఇచ్చి చోరీ చేసే ప్రయత్నం చేశారు. యజమాని గమనించడంతో దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. ఈ ఘటన సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. మరో సారి శనివారం కూడా దుండగులు ఆవులను దొంగిలించే ప్రయత్నం చేశారు. విషయాన్ని బాధితుడు గ్రామపెద్దల దృష్టికి తీసుకెళ్లాడు. గ్రామ పెద్దలు, బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ బాధ్యులు కలిసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. నెల రోజులుగా సుమారు 20 ఆవులు చోరీకి గురయ్యాయని, ఆవులకు మత్తు ఇంజెక్షన్ ఇచ్చి చోరీకి పాల్పడుతున్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో గ్రామ పెద్దలు, బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ బాధ్యులు ఉన్నారు.

# జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

## మహాజన సభలో ఏకగ్రీవ తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షురాలు కళ్యాణి

నిజాంసాగర్, మార్చి 31: సాగు నీటి కొరతతో చాలా మంది రైతులు ఆరు తడి పంట జొన్నను సాగు చేశారు. ప్రస్తుతం జొన్నలను కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని, వెంటనే జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని మహాజన సభలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. మండలంలోని మల్లూర్ సొసైటీ ఆవరణలో అధ్యక్షురాలు కళ్యాణి అధ్యక్షతన మహాజన సభను ఆదివారం నిర్వహించారు. ముందుగా జమాఖర్చుల నివేదికను చదివి వినిపించారు. సొసైటీ ఆధ్వర్యంలో మల్లూర్, వొడ్డేపల్లి, జక్కాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు అధ్యక్షురాలు తెలిపారు. రూ.రెండు లక్షలు రుణమాఫీ చేయాలని సభ్యులు తీర్మానించారు. సంఘ లావాదేవీలు, ఎరువులు, విత్తనాల విక్రయాల వివరాలపై చర్చించారు. సమావేశంలో సీఈవో సాయిలు, వైస్ ఎంపీపీ మనోహర్, నాయకులు బాబూసేట్, అంజయ్య, శ్రీనివాస్, సాయిలు, సిబ్బంది సత్యనారాయణ, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు రామారెడ్డి ఎంపీపీపై బలపరీక్ష

రామారెడ్డి, మార్చి 31: ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డిపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అవిశ్వాస సమావేశాన్ని సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సవితారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 9వ తేదీన ఎంపీపీపై అవిశ్వాస తీర్మానాన్ని ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు కలిసి ఆర్డీవోకు అందజేశారు. ఎంపీపీ హైకోర్టు నుంచి స్టే తీసుకువచ్చారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవోను విడుదల చేసి స్టేను ఎత్తివేసింది. దీంతో ఆర్డీవో రంగనాథరావు ఆధ్వర్యంలో సోమవారం బలపరీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

## ఘనంగా ఈస్టర్



ఈస్టర్ వేడుకలను ఎల్లారెడ్డిలోని సీఎస్ఐ చర్చిలో రెవరెండ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ సామెల్, క్రైస్తవులు పాల్గొన్నారు.
–ఎల్లారెడ్డి రూరల్, మార్చి 31

# మహనీయుడు సంత్ సేవాలాల్

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 31: గిరిజనుల జీవితాల్లో మార్పు తెచ్చిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహరాజ్ అని పౌరాఘడ్ పీఠాధిపతి బాబూసింగ్ మహరాజ్ అన్నారు. మండలంలోని తిమ్మారెడ్డి తండాలో ఉన్న సేవాలాల్ మందిర ఎనిమిదో వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మ వారికి భోగ్‌బండార్ సమర్పించారు. సేవాలాల్ మాలధారులకు భిక్ష ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో తండావాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



భోగ్‌బండార్‌లో నిర్వహిస్తున్న పౌరాఘడ్ పీఠాధిపతి బాబూసింగ్ మహరాజ్



## చేప @ 15కిలోలు

ఓ భారీ చేప ఆదివారం మత్స్యకారుడి వలకు చిక్కింది. కాస్లాబాద్‌కు చెందిన రామబోయి ఆదివారం ఉదయం గ్రామ చెరువులో చేపల వేటకు వెళ్లాడు. అతడి వలకు 15కిలోల బరువున్న చేప చిక్కింది. ఇప్పటివరకు ఇంతపెద్ద చేప దొరకలేదని అతడు తెలిపాడు. భారీ చేపను చూసేందుకు గ్రామస్తులు ఆసక్తి కనబర్చారు. అక్కడ ఉన్న వారు చేపను చేతిలో పట్టుకొని సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేశారు.
-పెద్దకొడప్‌గల్, మార్చి 31





బాన్సువాడ మండలంలోని సోమేశ్వర్ గ్రామ శివారులో చేపట్టిన వరికోతలు

# జోరుగా వరికోతలు

బాన్సువాడ, మార్చి 31: బాన్సువాడ నియోజకవర్గంలో యాసంగి వరి కోతలు ముమ్మరమయ్యాయి. ఇప్పటికే వర్ని, రుద్రూర్, కోటగిరి, పోతంగల్, చందూర్, మోస్రా తదితర మండలాల్లోని గ్రామాల్లో కోతలు ఊపందుకున్నాయి. అన్నదాతలు వరికోతలతోపాటు ధాన్యం ఆరబెట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. ఒకేసారి ధాన్యం పెద్దమొత్తంలో రావడంతో వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయాలని రైతులు కోరుతున్నారు. చాలాచోట్ల రైస్ మిల్లర్లు, బ్రోకర్లు ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు వడ్లను కొంటున్నట్లు చెప్పారు. బాన్సువాడ సొసైటీ పరిధిలోని నాగారం, కొల్లూర్, బాన్సువాడ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ఆర్యవైశ్య కల్యాణ మండపం నిధుల దుర్వినియోగం

### జిల్లా అధ్యక్షుడిపై సంఘ సభ్యుల ఆగ్రహం

బాన్సువాడ టౌన్, మార్చి 31: ఆర్యవైశ్య సంఘ కల్యాణ మండపానికి చెందిన నిధుల దుర్వినియోగంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘ అభివృద్ధికి కృషి చేయాల్సిన జిల్లా అధ్యక్షుడే ఇందుకు బాధ్యుడు కావడంతో తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పట్టణంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘ సమావేశం నిర్వహించి, నిధులను ఇష్టారీతిన ఖర్చు చేయడంపై అతడిని నిలదీయండంతో తెల్ల మొఖం వేశాడు. లెక్కలు చూపించాలని సభ్యులు పట్టుబట్టడంతో.. తనకు ఇష్టం వచ్చినట్లు చేస్తానని కుల పెద్దలపై దురుసుగా ప్రవర్తించాడు. దీంతో సమావేశం రసాభాసగా మారింది. సంఘ సభ్యులపై మర్యాదలేకుండా దుర్భాషలాడడంతో సహనం కోల్పోయిన కులస్తులు.. జిల్లా అధ్యక్షుడికి దేహశుద్ధి చేసి తరిమేసినట్లు తెలిసింది. ఈ విషయం బయటికి పొక్కడంతో.. సదరు వ్యక్తి కులస్తులతోపాటు ఇతరులతోనూ అమర్యాదగా ప్రవర్తించేవాడని, ఆయనకు తగిన గుణపాఠం జరిగిందని పట్టణవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## జిల్లాలో 30 పోలీస్ యాక్ట్

కామారెడ్డి, మార్చి 31 : జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్‌తోపాటు 1861 అమలు చేస్తున్నట్లు ఎస్పీ సింధూశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతి భద్రతల దృష్ట్యా ఈ నెలాఖరు వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. సభలు, సమావేశాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టేవారు తప్పకుండా పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

మాచారెడ్డి, మార్చి 31 : పాల్వంచ మండలంలోని భవానీపేట వాగు, ఫరీద్‌పేట గ్రామంలోని లొట్టివాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నామని ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని చెప్పారు.



భిక్కనూరు మండలం జంగపల్లి జడ్పీ ఉన్నతపాఠశాలలో చదివిన 1998–99 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి మిత్రులంతా 25 ఏండ్ల తర్వాత ఒక్కచోట కలుసుకోవడంతో భావోద్వేగానికి గురయ్యారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.
–భిక్కనూరు, మార్చి 31

## నవోదయకు చిన్నకొడప్‌గల్ విద్యార్థి ఎంపిక

పిట్లం, మార్చి 31: మండలంలోని చిన్నకొడప్‌గల్ ప్రాథమిక పాఠశాల వి ద్యార్థి ఎస్.కార్తీక్ నవోదయ పాఠశాలకు ఎంపికైనట్లు హెచ్ఎం మాణిక్యరావు ఆదివారం తెలిపారు. విద్యార్థి ఎంపికపై ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తంచేశారు. ఉపాధ్యాయులకు విద్యార్థి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## వాహనాల తనిఖీ

రాజంపేట్, మార్చి 31: మండలంలోని బస్వన్నపల్లి శివారులో ఆదివారం ఏఎస్సై గంగారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలు పాటించని, సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. తనిఖీల్లో పోలీసులు చిరంజీవులు, భాస్కర్ పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం



జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో ఉత్తమ ఉపాధ్యాయులు

కామారెడ్డి, మార్చి 31: పట్టణంలోని అవార్డీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను ఆదివారం ఘనంగా సన్మానించారు. సాందీపని డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంసింగ్ హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులతోపాటు అవార్డీ టీచర్స్ అసోసియేషన్ సేవలు ఆదర్శనీయమని అన్నారు. అంకితభావంతో వృత్తిని నిర్వర్తిస్తూనే సామాజిక సేవలు అందించడం ప్రవృత్తిగా ఎంచుకోవడం అభినందనీయమని అన్నారు. సమాజంలోని ప్రతిఒక్కరూ తమ విధులను బాధ్యతతో నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఆట కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు మనోహర్, బాల్‌రెడ్డి, కోశాధికారి హరిప్రసాద్, ఉపాధ్యక్షుడు అంబీర్ మనోహర్‌రావు, విష్ణువర్ధన్, కార్యదర్శి రాంమోహన్, నర్సింగ్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.